# ఆత్మ లక్షణములు

## కార్తిక్ నేమన

తను తన తల్లి గర్భమునందున్న సమయమున నారదుడు వచించినట్లుగా ప్రహ్లాదుడు ఇట్లు పలికెను.

ఈశ్వరమూర్త్తియైన కాలంబునంజేసి వృక్షంబు గలుగుచుండ ఫలంబునకు జన్మసంస్థాన వర్ధనాపక్షీణత్వ పరిపాకనాశంబులు ప్రాప్తంబులైన తెఱంగున దేహంబునకుంగాని షడ్భావ వికారంబు లాత్మకు లేవు (7.237)

కాలము భగవంతుని రూపమని, ఈ కాలానికి లోబడి దేహముండునుగాని, ఆత్మ అతీతమ్మైనదని నారదుని ఉవాచ. ఉదాహరణగా చెట్టు, చెట్టుకు కలిగే ఫలమును చూపబడినది. చెట్టు నిలిచియుండును. కాని దానికి కలిగే పూలు, ఫలములు పుట్టి - ఆరు మార్పులనొంది - చేనిపోవును. అటులనే ఎట్టి మార్పులకు లోను కాకుండగ ఆత్మ నిలిచియుండును, కాని దానికి అంటుకున్న భౌతిక శరీరము పుట్టి - ఆరు మార్పులనొంది - చేనిపోవును. చెట్టు వలన ఫలము కలుగును - ఆత్మ వలన శరీరము లభించును. కాని ఫలము వలన చెట్టు కలుగదు - ఆత్మ శరీరముపై ఆధారపడదు. ఇట్టి ఆత్మకుగల లక్షణములు పండ్రెండు:

ఆత్మ నిత్యుండు, క్షయ రహితుండు, శుద్ధుండు, క్షేత్రజ్ఞుండు, గగనాదులకు నాశ్రయుండు, గ్రియాశూన్యుండు, స్వప్రకాశుండు, సృష్టి హేతువు, వ్యాపకుండు, నిస్సంగుండుఁ, బరిపూర్ణుండు, నొక్కండునని వివేక సమర్థంబులగు నాత్మలక్షణంబులు పండ్రెండు (7.237)

ఆత్మ జ్ఞానము పొందవలెననిన ఉపవాసము, వ్రతము, శౌచము, శీలము, సంధ్యోపాసనము, జపము, దానము, అధ్యయనము ల వలన కలుగదు. కేవలము అచ్చపు భక్తి తోనే సాధ్యము - అని సూతుడు ఇలా చెప్పెను:

ఉపవాస వ్రత శౌచ శీల మఖ సంధ్యోపాసనాగ్నిక్రియా / జప దానాధ్యయనాది కర్మముల మోక్షప్రాప్తి సేకూర; ద
చ్చపు భక్తి న్ హరిఁ బుండరీకనయునన్ సర్వాతిశాయిన్ రమా/ ధిపుఁ బాపఘ్నుఁ బరేశు నచ్యుతుని నర్థిం గొల్వలేకుండినన్ (2.214)